# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటిస్తారు.**
2. **గత 12 ఏళ్ళలో భారత్ వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తిగా మారిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.**
3. **తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.**
4. **రైతుల భూ హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. భారత మండపంలో నిర్వహించే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు. ఈ సమావేశంలో ఎన్డీఏ కూటమికి సంబంధించిన అంశాలపై చర్చలు జరగనున్నాయి. రేపు రాష్ట్రపతి భవన్‌లో జరిగే నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. ఈ సమావేశంలో రాష్ట్రాభివృద్ధి, కేంద్ర-రాష్ట్ర సంబంధిత అంశాలపై చర్చలు జరగనున్నాయి. సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి బయలుదేరి అమరావతికి చేరుకుంటారని అధికారులు తెలిపారు.

--------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఆంధ్రప్రదేశ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి నిన్న దర్శించుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, గత 12 ఏళ్ళలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తిగా ఎదిగిందని. ప్రపంచంలోని అనేక దేశాలు వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, భారత్ లో ఇంధన స్థిరత్వం ఉందని పేర్కొంటూ,

వాయిస్..30..సెకన్లు

అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను ఆంధ్రప్రదేశ్‌లో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

---------------------------

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, పనితీరు సూచికలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో కీలక పనితీరు సూచికలను మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను మరింత సులభంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మన మిత్ర వేదిక ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

---------------------------

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రాజెక్టులకు తాను ఎప్పుడూ అడ్డుపడలేదని వాస్తవాలను ప్రజల ముందుంచాలని సూచించారు. ఆదిలాబాద్ విమానాశ్రయం నిర్మాణం, మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, పరిపాలనా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే, రైతులకు మద్దతుగా భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టామని కిషన్‌రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం కలిగించేలా సెప్టెంబర్ 10వ తేదీ నుంచి 12 వరకు విశాఖపట్నంలో 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ - ఐఏటీఓ వార్షిక సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అథారిటీ, ఐఏటీఓ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో ఈ ఒప్పందంపై ఇరు పక్షాల మధ్య సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 2014 మే 26న ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ, ఈరోజుతో 4 వేల 399 రోజుల పదవీకాలాన్ని పూర్తి చేసుకుని ప్రత్యేక రికార్డును నెలకొల్పనున్నారని నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. గత పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా దేశం పలు రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

---------------------------

రైతుల భూ హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో నిర్వహించిన "మీ భూమి–మీ హక్కు" కార్యక్రమంలో రాష్ట్ర రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు మంత్రి నిన్న పంపిణీ చేశారు. భూముల రీ–సర్వే పూర్తయిన ప్రతి రైతుకు ఆధునిక సాంకేతికతతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నామని ఈసందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాద ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కోరారు. విశాఖపట్నంలో నిన్న ఆయన మాట్లాడుతూ, బాధిత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

-------------------------

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వంఅత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72 లక్షల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

-------------------------

దేశ వ్యాప్తంగా జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ – గ్రామీణ్ –'వీబీ జీ రామ్ జీ' పథకం కోసం 95 వేల 692 కోట్ల రూపాయలను కేటాయించినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాల వారీగా ఆంధ్రప్రదేశ్‌కు 7 వేల 707 కోట్ల రూపాయలు, తెలంగాణకు 3 వేల 825 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు.

-------------------------

వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా, కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. వర్జీనియా పొగాకు రైతులు, కొనుగోలు సంస్థల సమన్వయంతోనే మార్కెట్ స్థిరత్వానికి సాధ్యమవుతుందని అన్నారు. ఎగుమతిదారులకు వడ్డీ లేని రాయితీ కల్పించాలన్న ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం

సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు, రవాణా వ్యయాల పెరుగుదల కారణంగా రైతులు అన్ని గ్రేడ్ల పొగాకును ఒకేసారి మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

-------------------------

తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

=======================